సాక్షి
ములుగు
శనివారం । 15 ఏప్రిల్ । 2023



అర్ధరాత్రి దొంగల బీభత్సం
జనగామ జిల్లాకేంద్రంలోని బాలాజీనగర్, జ్యోతినగర్, వడ్లకొండ ఎక్స్‌రోడ్డు, జూబ్లీగార్డెన్ ఏరియాలోని వెంకన్నకుంటలో ఆరు గృహాల్లో గురువారం దొంగలు తెగబడ్డారు. - IIలో▸



మొగిలయ్యకు మంత్రి పరామర్శ
బలగం మొగిలయ్యను శుక్రవారం మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్ ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. - IIలో▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
41.0°/26.0°

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఉష్ణోగ్రతలు పెరిగి ఎండ తీవ్రత ఉంటుంది. వేడి గాలులు వీస్తాయి.

రంజాన్ వేళలు
ఇఫ్తార్	సహర్
శని 6:38	ఆది 4:36

న్యూస్‌రీల్

వ్యవసాయానికి అనుసంధానం చేయాలి



ములుగు రూరల్: ఉపాధి హామీ పనులను వ్యవసాయానికి అనుసంధానం చేయాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పోరిక గోవింద్‌నాయక్ అన్నారు. శుక్రవారం మండలంలోని కాశిందేవిపేటలో ఉపాధిహామీ కూలీలకు పండ్లు పంపిణీ చేసి వారితో మాట్లాడారు. ఉపాధి పని ప్రదేశాలలో కూలీలకు వసతులు, తాగునీరు, టెంట్, ప్రథమ చికిత్స కిట్లు అందుబాటులో ఉంచాలని అన్నారు. కూలీ పనుల డబ్బులను సకాలంలో చెల్లించాలని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం జాతీయ ఉపాధి హామీ పథకం నిర్వీర్యం చేసే కుట్ర చేస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజ హుస్సేన్, భాస్కర్, సలేందర్‌రావు, లియాకత్, అజార్, సదర్‌లాల్, తిరుపతి పాల్గొన్నారు.


అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి
భూపాలపల్లి: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అదనపు ఎస్పీ వి.శ్రీనివాసులు కోరారు. అంబేడ్కర్ 132వ జయంతిని పురస్కరించుకొని శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూల మాలలు వేశారు. అనంతరం ఏఎస్పీ మాట్లాడుతూ.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సామాన్య నిరుపేద కుటుంబంలో జన్మించినప్పటికీ తన అపార మేధాశక్తులతో సమాజంలోని రుగ్మతలను దూరం చేసేందుకు పాటుపడిన మహనీయుడని కొనియాడారు. బలహీన వర్గాల అభ్యున్నతి కోసం పాటుపడ్డారన్నారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ శ్రీనివాస్, భూపాలపల్లి డీఎస్పీ రాములు, సీఐ రాంనర్సింహారెడ్డి, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

జార్జిరెడ్డి ఆశయాలు కొనసాగిద్దాం



మహాముత్తారం(మల్హర్): విద్యార్థుల సమస్యలపై నిరంతరం పోరాడి చైతన్యపరిచి ఉద్యమించిన జార్జిరెడ్డి ఆశయాలను కొనసాగించాలని యువైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు అక్కల బాపుయాదవ్ అన్నారు. ప్రగతిశీల విద్యార్థి నాయకుడు జార్జిరెడ్డి 51 వర్ధంతి సందర్భంగా మల్హర్ మండలం కొయ్యూర్‌లో తెలంగాణ మాలభేరి రాష్ట్ర కన్వీనర్ పీక కిరణ్‌తో కలిసి జార్జిరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ జార్జిరెడ్డి పోరాటాలను ఓర్వలేక ఏబీవీపీ గుండాలు దారుణంగా చంపారన్నారు. విద్యార్థుల్లో చైతన్యం తీసుకురావడంలో ఆయన చేసిన కృషి మరువలేనిదని చెప్పారు. శాస్త్రీయ విద్యా విధానం కోసం అనేక విద్యార్థి ఉద్యమాలు నేటికీ కొనసాగుతున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో నరేల ఓదెలు, రాజనర్సు, ఎడ్ల రాములు తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌పీఐ రథయాత్ర ప్రారంభం



భూపాలపల్లి అర్బన్: రిపబ్లిక్ పార్టీ ఇండియా (ఆర్‌పీఐ) ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా చేపట్టనున్న రథయాత్రను శుక్రవారం జిల్లాకేంద్రంలో పార్టీ నాయకులు ప్రారంభించారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పసుల రవికుమార్ హాజరై యాత్ర ప్రారంభించి మాట్లాడారు. జిల్లా కేంద్రంలో ప్రారంభమైన యాత్ర 50రోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా చేపడుతూ దళితులపై జరుగుతున్న అన్యాయాలను ప్రశ్నిస్తూ ప్రజా సమస్యలను తెలుసుకుంటామని చెప్పారు. హైదరాబాద్‌లో అతిపెద్ద అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర, స్థానిక నాయకులు స్నేహలత, వెంకన్న, ఎల్లయ్య, మదునమ్మ, లావణ్య, సరిత, రవళి, శాంత, ప్రియాంక పాల్గొన్నారు.

తునికాకు సేకరణ కనుమరుగేనా..?

టెండర్లకు ముందుకు రాని కాంట్రాక్టర్లు
- జిల్లాలో 35 యూనిట్లు..
- అమ్ముడుపోయింది కేవలం 10..
- బీడీల తయారీ, కొనుగోలు తగ్గడమే కారణం
- ఉపాధి కోల్పోతున్న అటవీ గ్రామాల ప్రజలు



భూపాలపల్లి: అటవీ గ్రామాల ప్రజలు, గిరిజనులకు వేసవిలో ఉపాధి కల్పించే తునికాకు సేకరణ రానున్న రోజుల్లో కనుమరుగయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. తునికాకుకు డిమాండ్ తగ్గడంతో ఎన్నిసార్లు టెండర్లు ఆహ్వానించినా కాంట్రాక్టర్లు ముందుకు రావడంలేదు. ఫలితంగా అమ్ముడుపోని యూనిట్లలో ఆకు సేకరణ జరగక కూలీలు ఉపాధి కోల్పోతున్నారు.

ఈ ఏడాది 10 యూనిట్లే..
జిల్లాలోని మహదేవపూర్ అటవీ డివిజన్‌లో 16, భూపాలపల్లి డివిజన్‌లో 19.. మొత్తంగా 35 తునికాకు యూనిట్లు ఉన్నాయి. ఈ యూనిట్లను దక్కించుకునేందుకు పదేళ్ల క్రితం వరకు కాంట్రాక్టర్లు పోటీ పడి టెండర్లు వేసేవారు. పలుమార్లు సిండికేట్‌గా ఏర్పడి యూనిట్లను దక్కించుకున్న దాఖలాలు కూడా ఉన్నాయి. తునికాకు డిమాండ్ తగ్గిన కారణంగా కొంతకాలంగా టెండర్‌లో పాల్గొనేవారే కరువయ్యారు. అటవీశాఖ అధికారులు నాలుగైదు సార్లు టెండర్లు ఆహ్వానించినప్పటికీ ఎవరూ ముందుకు రావడం లేదు. ఈ ఏడాది జిల్లాలోని 35 యూనిట్లకు కేవలం 10 యూనిట్లు మాత్రమే అమ్ముడుపోయాయి. దీంతో చేసేది లేక అమ్ముడుపోయిన యూనిట్లలో మాత్రమే కల్లాలను ఏర్పాటు చేసేందుకు అటవీశాఖ అధికారులు సిద్ధమవుతున్నారు. జిల్లావ్యాప్తంగా 39,400 స్టాండర్డ్ బ్యాగుల ఆకు సేకరణ లక్ష్యం కాగా కొన్నేళ్లుగా పూర్తిస్థాయిలో యూనిట్లు అమ్ముడుపోని కారణంగా లక్ష్యం చేరుకోవడం లేదు.

నాడు వేసవిలో ఇదే ఉపాధి..
జిల్లాలో దట్టమైన అడవులు ఉన్నాయి. ఇక్కడ తునికాకు మొక్కలు పుష్కలంగా ఉంటాయి. ఆకు సేకరణ కోసం ప్రతీ ఏటా ఫిబ్రవరి, మార్చి నెలల్లో అటవీశాఖ నిర్వహించే టెండర్లను దక్కించుకున్న కాంట్రాక్టర్లు ఏప్రిల్ నెలలో ప్రూనింగ్(కొమ్మ కొట్టడం) చేస్తారు. దీంతో ఆకు ఎక్కువగా రావడమే కాక నాణ్యతతో వస్తుంది. అనంతరం మే నెలలో కూలీలతో ఆకు సేకరణ చేపట్టేది. ఆ సమయంలో వ్యవసాయ పనులు లేని కారణంగా అటవీ గ్రామాల ప్రజలంతా ఈ ఆకు సేకరణకు వెళ్లేవారు. అడవుల్లో సేకరించి తీసుకొచ్చిన ఆకును ఇంటి వద్దనే 50 ఆకుల చొప్పున కట్టలు కట్టి కాంట్రాక్టర్‌కు విక్రయించే వారు. ఒక్కో కట్టకు రూ.1.40 చొప్పున రాగా రోజు కూలీ గిట్టుబాటు అయ్యేది. దీంతో అటవీ గ్రామాల ప్రజలు ఆకు సేకరణపై ఎక్కువ మక్కువ చూపేవారు. కొంతకాలంగా తునికాకు యూనిట్లు అమ్ముడుపోక, ఆకు సేకరణ జరగక కూలీలు ఇబ్బంది పడుతున్నారు.

మూడేళ్లుగా అమ్ముడుపోయిన యూనిట్ల వివరాలు..

డివిజన్	మొత్తం	2021	2022	2023
భూపాలపల్లి	19	12	14	4
మహదేవపూర్	16	12	12	6

బీడీలకు డిమాండ్ లేకనే..
తునికాకును బీడీ లీఫ్ అంటారు. ఈ ఆకులను బీడీల తయారీకి మాత్రమే ఉపయోగిస్తారు. ప్రస్తుతం మార్కెట్‌లో అనేక రకాల సిగరేట్‌లు లభించడం, బీడీలు తాగే వారి సంఖ్య తక్కువగా ఉండటంతో తయారీ, విక్రయాలు తగ్గిపోయాయి. దీనికి తోడు ప్రస్తుతం ఇళ్లలో బీడీలు చుట్టే వారే లేరు. దీంతో తునికాకు డిమాండ్ పూర్తిగా తగ్గిపోయింది.

రెండు కారణాలు..



“టెండర్లు వేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడానికి రెండు కారణాలు ఉన్నాయి. మార్కెట్‌లో బీడీలకు డిమాండ్ లేకపోవడంతో బీడీ కంపెనీలు తగ్గిపోయాయి. దీనికి తోడు ఎండాకాలంలో మొక్క ఎదిగే సమయంలో ఒకటి రెండు వర్షాలు కురిస్తే ఆకు మంచిగా వస్తుంది. ప్రస్తుత ఎండలకు ఆకు సరిగా రాకపోవడంతో కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు.
- కృష్ణప్రసాద్, ఎఫ్‌డీఓ, భూపాలపల్లి

దేశానికి దిక్సూచి అంబేడ్కర్



ములుగు: నివాళులర్పిస్తున్న అదనపు కలెక్టర్



ఏటూరునాగారం: నివాళులర్పిస్తున్న పీఓ అంకిత్

ములుగు: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ దేశానికి దిక్సూచి అని అదనపు కలెక్టర్(రెవెన్యూ) వైవీ గణేశ్ అన్నారు.బీఆర్ అంబేడ్కర్ 132వ జయంతి ఉత్సవాలు శుక్రవారం కలెక్టరేట్‌లో జరిగాయి. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పోరిక గోవింద్‌నాయక్, డీఆర్వో కూతాటి రమాదేవిలతో కలిసి అదనపు కలెక్టర్ అంబేడ్కర్‌చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగం సమానత్వానికి నిలువెత్తు నిదర్శనం అన్నారు. అభివృద్ధిపై ఇప్పటికే జాతీయ స్థాయిలో జిల్లా రెండవ స్థానంలో నిలిచిందన్నారు. ఈ నెల 17న రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డు అందుకోనున్నట్లు తెలిపారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పోరిక గోవింద్‌నాయక్ మాట్లాడుతూ అంబేడ్కర్‌కు ఘన నివాళిగా రాజధానిలో 125 అడుగుల విగ్రహాన్ని ఆవిష్కరించడం గొప్ప విషయం అన్నారు. అంతకుముందు జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ నుంచి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సబ్ రిజిస్ట్రార్ తస్లీమా మహ్మద్, రైతు సమన్వయ సమితి ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల కోఆర్డినేటర్ పల్లా బుచ్చయ్య, డీఎంహెచ్ఓ అల్లెం అప్పయ్య, ఎంపీపీ గండ్రకోట శ్రీదేవిసుధీర్‌యాదవ్, జిల్లా షెడ్యూల్ కులాల అధికారి లక్ష్మణ్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ తుల రవి, కలెక్టరేట్ ఏఓ విజయభాస్కర్, తహసీల్దార్ మధురకవి సత్యనారాయణ, జిల్లా క్వాలిటీ కంట్రోల్ అధికారి బద్దం సుదర్శన్‌రెడ్డి, యువజన సర్వీసుల అధికారి పీవీ రమణాచారి, కుల సంఘాల జేఏసీ అధ్యక్షుడు ముంజాల భిక్షపతిగౌడ్, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ సభ్యులు పాల్గొన్నారు.

మహనీయుడు అంబేడ్కర్
ఏటూరునాగారం: భారత రాజ్యాంగ నిర్మాణ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ దేశానికి ఎనలేని సేవలు చేశారని ఐటీడీఏ పీఓ అంకిత్ కొనియాడారు. ఐటీడీఏ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి పీఓ అంకిత్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పీఓ మాట్లాడుతూ కార్మిక, ఉపాధి శాఖ మంత్రిగా పనిచేసే క్రమంలో పనిగంటలను 12నుంచి 8గంటలకు అంబేడ్కర్ తగ్గించారన్నారు. న్యాయ మంత్రిగా ఉన్నందున హిందూ బిల్లుపై సవరణలు చేశారని, గతంలో తండ్రి ఆస్తిలో మహిళలకు హక్కు లేకుండా ఉండేదని, అంబేడ్కర్ బిల్లును సవరించి ఇప్పుడు కుమార్తెలు కూడా హక్కులు కల్పించే విధంగా సూత్రాలు ఉన్నాయన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యానిధి, స్కాలర్‌షిప్‌లు, స్పాన్సర్, ఎంఎస్ఎంఈ, ఈఎస్ఎస్ వంటి పథకాలను అమలు చేస్తున్నట్లు పీఓ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ వసంతరావు, ఈఈ హేమలత, పీహెచ్ఓ రమణ, జీసీసీ డీఎం ప్రతాప్‌రెడ్డి, ఎస్ఓ రాజ్‌కుమార్, ఏఓ దామోదరస్వామి, ఏసీఎంఓ రవీందర్, పెసా కోఆర్డినేటర్ కొమురం ప్రభాకర్, ఏఏఓ సంతోష్, డీఎస్ఓ లాల్, జేడీఎం కొండల్‌రావు పాల్గొన్నారు.

టెన్త్ లీకేజీ నిందితుడి విచారణ
కమలాపూర్: పదో తరగతి హిందీ ప్రశ్నపత్రం లీకేజీ, కాపీ కుట్ర కేసులో నిందితుడైన కమలాపూర్ మండలంలోని దేశరాజుపల్లికి చెందిన పోతనబోయిన వర్షిత్ అలియాస్ చందును కోర్టు అనుమతితో శుక్రవారం రెండు రోజుల కస్టడీకి తీసుకున్న కమలాపూర్ పోలీసులు అతడిని విచారిస్తున్నారు. మొదటి రోజు విచారణలో భాగంగా వర్షిత్‌ను స్థానిక ఇన్‌స్పెక్టర్ బి.సంజీవ్ ఆధ్వర్యంలో పదో తరగతి హిందీ ప్రశ్నపత్రం బయటికి ఎలా వచ్చింది.. ఎవరెవరికి పంపావు.. తదితర కోణాల్లో విచారణ జరిపినట్లు సమాచారం. రెండు రోజుల విచారణ అనంతరం వర్షిత్‌ను తిరిగి మేజిస్ట్రేట్ ఎదుట హాజరు పరుచనున్నట్లు ఇన్‌స్పెక్టర్ సంజీవ్ తెలిపారు.

గొప్ప వ్యక్తి అంబేడ్కర్



పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే సీతక్క



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సీతక్క

ములుగు: సమాజంలో అన్ని వర్గాల సమానత్వానికి పాటుపడిన గొప్పవ్యక్తి, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని ములుగు ఎమ్మెల్యే ధనసరి సీతక్క అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. అనంతరం సీతక్క మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ తత్వవేత్తగా, రచయితగా, సంఘ సంస్కర్తగా, బహుభాషావేత్తగా సామాజిక అసమానతల నిర్మూలనకు తన జీవితాన్ని అంకితం చేశారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి రాజేందర్‌గౌడ్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బానోత్ రవిచందర్, మండల అధ్యక్షుడు ఎండీ చాంద్‌పాషా, వర్కింగ్ ప్రెసిడెంట్లు ఆకుతోట చంద్రమౌళి, నల్లెల భరత్‌కుమార్, మట్టెవాడ తిరుపతి, షకీల్‌పాషా, మర్రి రాజు, జక్కుల రేవంత్ యాదవ్, నూనేటి శ్యాంయాదవ్, అర్షం రఘు, బోడ రఘు, తిరుపతిరెడ్డి, దేవ్‌సింగ్, వంశీ కృష్ణ, జన్ను రవి, బోడ సతీశ్, ఓరుగంటి అనిల్ పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణ అందరి బాధ్యత
అగ్ని ప్రమాదాలను అరికట్టడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ములుగు ఎమ్మెల్యే డాక్టర్ ధనసరి సీతక్క అన్నారు. ఈ నెల 14నుంచి 20వరకు నిర్వహించనున్న అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం శాఖ కార్యాలయంలో వాల్‌పోస్టర్‌ను సీతక్క ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ అగ్ని ప్రమాదాలు జరగకుండా తగిన చర్యలు తీసుకునేలా శాఖ అధికారులు అవగాహన కల్పిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బానోత్ రవిచందర్, వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు నల్లెల భరత్‌కుమార్, మండల ఉపాధ్యక్షుడు అర్షం రఘు, బోడ రఘు, ఓరుగంటి అనిల్, బోడ సతీష్, అగ్నిమాపక అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు బీజేపీ ‘నిరుద్యోగ మార్చ్’

- అనుమతిచ్చిన పోలీసులు
- కేయూ క్రాస్ నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు భారీ ర్యాలీ
- హాజరుకానున్న బండి సంజయ్, పార్టీ అగ్రనేతలు



కేయూ వద్ద ఏర్పాటుచేసిన బీజేపీ ఫ్లెక్సీలు

హన్మకొండ: టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీక్, అమ్మకాలపై నిరసనగా, నిరుద్యోగులకు భరోసా కల్పిస్తూ శనివారం వరంగల్ నగరంలో బీజేపీ నిరుద్యోగ మార్చ్ నిర్వహించనుంది. ఈ మేరకు పార్టీ నాయకత్వం అన్ని ఏర్పాట్లు చేసింది. కార్యక్రమాన్ని మధ్యాహ్నం 3 నుంచి రాత్రి 8 గంటల వరకు నిర్వహించుకోవచ్చని పోలీసులనుంచి అనుమతి లభించింది. మార్చ్ విజయవంతానికి పార్టీ నాయకులు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పెద్ద ఎత్తున క్యాంపెయిన్ చేశారు. శనివారం సాయంత్రం 4 గంటలకు హనుమకొండలోని కాకతీయ యూనివర్సిటీ క్రాస్ రోడ్డు నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు వేలాది మందితో భారీ ర్యాలీ నిర్వహించనున్నారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహం వద్ద ప్రదర్శన ఉంటుంది. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ కుమార్‌తో పాటు పార్టీ అగ్ర నాయకులు పాల్గొంటారని స్థానిక నాయకులు తెలిపారు. కాగా నిరుద్యోగ మార్చ్‌కు ఉస్మానియా, కాకతీయ యూనివర్సిటీ జేఏసీలు మద్దతు ప్రకటించాయి ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, నిరుద్యోగ మార్చ్ నిర్వహణ కమిటీ కన్వీనర్ డాక్టర్ గంగిడి మనోహర్ రెడ్డి మాట్లాడుతూ శనివారం ఓరుగల్లు పోరుగడ్డపై జరిగే నిరుద్యోగ మార్చ్‌ను జయప్రదం చేయాలని నిరుద్యోగులకు పిలుపునిచ్చారు. కేసీఆర్ పాలనలో దగాపడ్డ ప్రజలంతా సంఘీభావం తెలపాలని కోరారు.

నాలుగు రోజులుగా క్యాంపెయిన్
బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి, ఆరు జిల్లాల పార్టీ అధ్యక్షుల ఆధ్వర్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో నాలుగు రోజులుగా క్యాంపెయిన్ నిర్వహించారు. 13న రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. కోచింగ్ సెంటర్లు, గ్రంథాలయాలు, విద్యాసంస్థలకు వెళ్లి నిరుద్యోగ మార్చ్‌కు తరలిరావాలని పిలుపునిచ్చారు,. కరపత్రాలు పంచారు.ఉమ్మడి వరంగల్ జిల్లానుంచి తరలివచ్చేలా కార్యాచరణ రూపొందించారు.

అంబేడ్కర్ ఆశయాలను కొనసాగించాలి



నివాళులర్పిస్తున్న భాస్కర్‌రెడ్డి

ములుగు రూరల్: డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ ఆశయాలను కొనసాగించాలని భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడు చింతలపూడి భాస్కర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో అంబేడ్కర్ 132వ జయంతి సందర్భంగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి అంబేడ్కర్ అన్నారు. అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహనీయుడు అంబేడ్కర్ అని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి నగరపు రమేష్, సిరికొండ బలరాం, భూక్యా రాజునాయక్, జవహర్ లాల్, రవీంద్రాచారి, రాకేష్‌రెడ్డి, ఇమ్మడి రాకేష్‌యాదవ్, రాకేష్‌రెడ్డి, సురేందర్ పాల్గొన్నారు.

నగరంలో నేడు ట్రాఫిక్ మళ్లింపు



ట్రాఫిక్ ఏసీపీ మధుసూదన్

వరంగల్ క్రైం: బీజేపీ శనివారం తలపెట్టిన నిరుద్యోగ మార్చ్ ర్యాలీ సందర్భంగా వరంగల్, హనుమకొండ నగరాల్లోని పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ మళ్లింపులు ఉంటాయని వరంగల్ కమిషనరేట్ ట్రాఫిక్ ఏసీపీ మధుసూదన్ తెలిపారు. నిరుద్యోగ మార్చ్ సాయంత్రం 4 గంటలకు కేయూసీనుంచి ప్రారంభమై హనుమకొండ అంబేడ్కర్ జంక్షన్ వరకు సాగుతుందని, ఈ నేపథ్యంలో పలు చోట్ల ట్రాఫిక్ మళ్లింపు, ఆంక్షలు సాయంత్రం 3 నుంచి రాత్రి 8 గంటల వరకు ఉంటాయని పేర్కొన్నారు.

ట్రాఫిక్ మళ్లింపు ఇలా...
- కరీంనగర్ నుంచి హనుమకొండ, వరంగల్ వైపు వెళ్లే వాహనాలు కేయూసీ క్రాస్ రోడ్డు నుంచి పెగడపల్లి డబ్బాలు, పెద్దమ్మగడ్డ, ములుగు రోడ్డు మీదుగా హనుమకొండ బస్టాండ్, వరంగల్‌కు చేరుకోవాలి. కరీంనగర్ నుంచి కాజీపేట వెళ్లే వాహనాలు కేయూసీ క్రాస్ రోడ్డునుంచి సెయింట్ పీటర్స్ స్కూల్, అంబేడ్కర్ భవన్, సుబేదారి మీదుగా కాజీపేట వెళ్లాల్సి ఉంటుంది.
- వరంగల్ నుంచి కాజీపేటకు వెళ్లే వాహనాలు ములుగు రోడ్డు, హనుమకొండ చౌరస్తా, అశోక జంక్షన్, హనుమకొండ బస్టాండ్, కాళోజి జంక్షన్ మీదుగా కాజీపేట చేరుకోవాలి.
- కరీంనగర్ వైపు వెళ్లే వాహనాలు ములుగు రోడ్డు, పెద్దమ్మగడ్డ, పెగడపల్లి డబ్బాలు, కేయూసీ క్రాస్ రోడ్డు గుండా వెళ్లాలి.
- కాజీపేట, సుబేదారి నుంచి హనుమకొండ, వరంగల్, కరీంనగర్ వెళ్లే వాహనాలు కాళోజి జంక్షన్ మీదుగా బాలసముద్రం, హనుమకొండ బస్టాండ్ జంక్షన్, అశోక జంక్షన్, ములుగు రోడ్డు మీదుగా వరంగల్‌కు వెళ్లాలి. పెద్దమ్మగడ్డ, పెగడపల్లి డబ్బాలు, కేయూసీ క్రాస్ రోడ్డు నుంచి కరీంనగర్‌కు వెళ్లాళి.

ప్రజలు ఈ విషయాన్ని గమనించి పై తెలిపిన ప్రత్యామ్నాయ మార్గాలలో ప్రయాణించి పోలీసులకు సహకరించాలని ట్రాఫిక్ ఏసీపీ మధుసూదన్ కోరారు.

విజ్ఞాన సదస్సు..



అవగాహన కల్పిస్తున్న జడ్జి జయరామిరెడ్డి

భూపాలపల్లి అర్బన్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 132వ జయంతిని పురస్కరించుకొని మండలంలోని కాశీంపల్లి గ్రామంలో జిల్లా న్యాయ సేవా సహకార సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా సహకార సంస్థ జిల్లా కార్యదర్శి జయరాంరెడ్డి, జూనియర్ సివిల్ జడ్జి రామచంద్రరావు హాజరయ్యారు. ప్రాథమిక హక్కులు, న్యాయ సహకార సలహాలు, సత్వర న్యాయం గురించి వివరించారు. ప్రతి ఒక్కరూ చట్టాలను గౌరవిస్తూ.. చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. రాజ్యాంగం ప్రకారం చట్టం ముందు అందరూ సమానులేనని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాస్, ఆనందరావు, మున్సిపల్ వైస్‌చైర్మన్ హరిబాబు, ప్రజాప్రతినిధులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

కార్యదర్శులను రెగ్యులరైజ్ చేయాలి
భూపాలపల్లి రూరల్: గ్రామ పంచాయతీల్లో పనిచేసే కార్యదర్శులను రెగ్యులరైజ్ చేయడంతో పలు డిమాండ్లను నెరవేర్చాలని తెలంగాణ పంచాయతీ సెక్రటరీస్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు బొలవేని రాంబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మంజూర్‌నగర్‌లోని ఏఎస్ఆర్ గార్డెన్‌లో కార్యదర్శులతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మూడేళ్ల ప్రొబిషన్ పీరియడ్ తర్వాత రెగ్యులర్ చేస్తామని హామీఇచ్చి కార్యదర్శులను ఏప్రిల్ 2019లో ఉద్యోగాలల్లోకి తీసుకుందన్నారు. 2022 నాటికి మూడు సంవత్సరాలు పూర్తయినప్పటికీ ప్రభుత్వం మరో సంవత్సరం పొడిగించిందన్నారు. ఇప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. సమస్యలు పరిష్కరించకుంటే ఈనెల 29నుంచి సమ్మె చేయనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నవీన్, కోశాధికారి మనోజ్, ఉపాధ్యక్షుడు శ్రీకాంత్, గౌరవ అధ్యక్షుడు రాములు, సభ్యులు వినోద్, హేమంత్, వివిధ మండలాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

అధికార పార్టీ కౌన్సిలర్ల నిరసన



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న బీఆర్ఎస్ కౌన్సిలర్లు

భూపాలపల్లి: భూపాలపల్లి మున్సిపాలిటీ చైర్‌పర్సన్ సెగ్గం వెంకటరాణిసిద్దు ఒంటెద్దు పోకడ మానుకోవాలని అధికార బీఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్లు నూనె రాజు, ముంజంపల్లి మురళి, ఎడ్ల మౌనిక, పానుగంటి హారిక, చల్ల రేణుక, ఆకుదారి మమత సూచించారు. శుక్రవారం రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని భూపాలపల్లి పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి వారు పూల మాలలు వేశారు. అనంతరం చైర్‌పర్సన్, అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ అక్కడే నిరసన వ్యక్తంచేశారు. అంబేడ్కర్ జయంతి వేడుకలకు మున్సిపల్ చైర్‌పర్సన్, అధికార యంత్రాంగం కనీసం తమకు ఆహ్వానం తెలియజేయలేదని ఆవేదన వ్యక్తంచేశారు. నిర్ణీత సమయంలో కౌన్సిల్ సమావేశాలు నిర్వహించడం లేదని, చైర్‌పర్సన్ సొంత నిర్ణయాలతో మున్సిపాలిటీని తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ పార్టీకి మాయని మచ్చలా తయారయ్యారన్నారు. చైర్‌పర్సన్‌పై త్వరలోనే ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డికి ఫిర్యాదు చేస్తామని కౌన్సిలర్లు వెల్లడించారు.

క్లుప్తంగా

కుక్కదాడిలో చిన్నారికి తీవ్ర గాయాలు


కుక్క దాడిలో గాయపడిన అక్షిత

కేసముద్రం: మండలంలోని ధన్నసరి గ్రామ శివారు రేకులతండాలో శుక్రవారం కుక్క దాడితో ఏడేళ్ల చిన్నారికి తీవ్ర గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన బానోత్ సురేశ్, స్వరూప దంపతుల కుమార్తె అక్షిత, మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో రెండోతరగతి చదువుతోంది. సెలవు కావడంతో కూతుర్ని ఇంటి పక్కనే ఉన్న మొక్కజొన్న చేనువద్దకు తల్లిదండ్రులు తీసుకెళ్లారు. గట్టుపై అక్షితను కూర్చోబెట్టి కంకులు విరిచేందుకు చేనులోకి వెళ్లారు. ఇంతలో కుక్క వచ్చి చిన్నారిపై దాడికి పాల్పడింది. చిన్నారి కుడి కన్నుపై, మెడ వెనుకభాగంలో, కుడి చేతికి తీవ్ర గాయాలై రక్తస్రావమైంది. చికిత్స నిమిత్తం బాలికను మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

మరో బాలుడికి..

కేసముద్రం: మండలంలోని వెంకటగిరి శివారు చంద్రుతండాకు చెందిన భుక్యా బిచ్చా, పార్వతి దంపతుల కుమారుడు విధన్ ఇంటి ఎదుట ఆడుకుంటుండగా.. అటుగా వచ్చిన మూడు వీధి కుక్కలు ఆ బాలుడిపై దాడి చేశాయి. గమనించిన తండావాసులు ఆ కుక్కలను తరిమి కొట్టారు. అప్పటికే ఆబాలుడి చేతికి, తలపై గాయాలయ్యాయి. ఇంతలో మిర్చి ఏరేందుకు వెళ్లిన తల్లిదండ్రులు విషయం తెలుసుకుని, హుటాహుటిన వచ్చారు. వెంటనే బాలుడిని ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స అందించారు.

పాము కాటుకు మహిళ మృతి


సోమక్క మృతదేహం

వర్ధన్నపేట: ప్రమాదవశాత్తు పాము కాటుతో మండలంలోని ల్యాబర్తి గ్రామానికి చెందిన తాటికాయల సోమక్క(63) శుక్రవారం మృతి చెందింది. సోమక్క తన వ్యవసాయ క్షేత్రం వద్దకు వెళ్తుండగా.. విషపూరిత పాము ఆమెను కాటేసింది. అపస్మారక స్థితికి చేరుకున్న ఆమెను స్థానికులు ఆస్పత్రికి తరలించే క్రమంలో ఆమె మృతి చెందింది. మృతురాలి కుమారుడు యాకయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై రామారావు తెలిపారు.

అర్ధరాత్రి దొంగల బీభత్సం

- జనగామలో ఒకే తరహాలో ఆరు ఇళ్లలో చోరీ
- 137 గ్రాముల బంగారం.. 310 తులాల వెండి, రూ.1.50 లక్షల నగదు చోరీ


దొంగతనం ఎలా జరిగిందనే విషయాన్ని ఆరా తీస్తున్న ఏసీపీ, పక్కన సీఐ

జనగామ: జిల్లా కేంద్రంలోని బాలాజీనగర్, జ్యోతినగర్, వడ్లకొండ ఎక్స్‌రోడ్డు, జూబ్లీగార్డెన్ ఏరియాలోని వెంకన్నకుంటలో ఆరు గృహాల్లో గురువారం అర్ధరాత్రి దొంగలు తెగబడ్డారు. కాలనీల్లో ముందుగా రెక్కీ నిర్వహించి.. తాళాలు వేసి ఉన్న ఇళ్లను టార్గెట్ చేశారు. సుమారు అర్ధరాత్రి 1.30 గంటల ప్రాంతంలో కాలనీలో చొరబడిన దొంగలు యథేచ్ఛగా తమ పని కానిచ్చేశారు. ఒకేరోజు ఆరు గృహాల్లో జరిగిన దొంగతనాల్లో సుమారు 137 తులాల బంగారు ఆభరణాలు, 310 తులాల వెండి ఆభరణాలు, రూ.1.50 లక్షల నగదు చోరీకి గురైంది.

చోరీలివే..

- బాలాజీనగర్‌కు చెందిన రైల్వే ఎంప్లాయి మీసాల శేఖర్ ఇంట్లో 47 గ్రాముల బంగారు ఆభరణాలు, 15 తులాల వెండి వడ్డానం మొత్తం రూ.2.44 లక్షల విలువ చేసే సొత్తును దొంగలు ఎత్తుకెళ్లారు.
- బాలాజీనగర్‌కు చెందిన గంగం భానుప్రకాశ్ రెడ్డి ఇంట్లో 40 గ్రాములు బంగారు ఆభరణాలు, 15 తులాల వెండి, మొత్తం విలువ రూ.2.27 లక్షల విలువైన సొత్తు ఎత్తుకెళ్లారు. కాగా.. భానుప్రకాశ్ రెడ్డి ఇంటి పక్కనే జనగామ స్టేషన్ ఐటీ, కమ్యూనికేషన్ ఏఎస్ఐ ఆంజనేయులు ఉంటారు.
- జ్యోతినగర్‌లో అద్దె ఇంట్లో నివాసముంటున్న గోల్డ్ స్మిత్(వర్కర్) మారోజు సురేశ్ వర్క్ కోసం తీసుకున్న 130 తులాల వెండి ఆభరణాలు, 25 గ్రాముల బంగారాన్ని ఎత్తుకెళ్లారు. కాగా.. సురేశ్, అతడి కుటుంబీకులు ఇంట్లో నిద్రిస్తుండగానే.. దొంగలు వచ్చిన పని కానిచ్చేశారు.
- బాలాజీనగర్‌లోని ఓ అపార్టుమెంట్‌లో లింగాలఘణపురం ఎస్ఐ ప్రవీణ్ అద్దెకు ఉంటున్న ఇంటి పక్కనే ఓ మహిళా ప్రభుత్వ ఉద్యోగి ఉంటున్నారు. విధుల్లో ఆలస్యం అయిన సమయంలో ఇక్కడ స్టే చేస్తారు. ఆమె లేని విషయం తెలుసుకున్న దొంగలు.. ఎస్ఐ తలుపునకు బయట నుంచి లాక్ చేసి ఆమె ఇంట్లో చోరీకి పాల్పడ్డారు. కానీ దొంగలకు ఏమీ చిక్కలేదు.


దొంగలు వదిలి వెళ్లిన రాళ్లు

- జూబ్లీ గార్డెన్ ఏరియా వెంకన్నకుంటలోని ఓ మహిళ ఇంట్లో 15 గ్రాముల బంగారాన్ని దొంగలు ఎత్తుకెళ్లారు.
- వడ్లకొండ ఎక్స్‌రోడ్డులో నివాసముంటున్న సీనియర్ జర్నలిస్టు అశోక్‌కుమార్ ఇంట్లో కిలోన్నర వెండి(పూజ సామగ్రి), రూ.20 వేల నగదు ఎత్తుకెళ్లారు.

దొంగల వెంట రాళ్లు..

వరుస చోరీలకు పాల్పడుతున్న దొంగలు.. తమ వెంట రాళ్లు తెచ్చుకుంటున్నారు. ఇంట్లో ఎవరైనా ఎదురు తిరిగితే.. రాళ్లతో దాడి చేయవచ్చనే ప్లాన్ చేసుకున్నట్లు దొంగలు వదిలి వెళ్లిన కంకర రాళ్లను చూస్తే తెలుస్తోంది. కాగా.. బాధితులు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఏసీపీ దేవేందర్‌రెడ్డి, సీఐ ఎలబోయిన శ్రీనివాస్, ఎస్ఐ రఘుపతి చోరీ జరిగిన ఆరు ఇళ్లను పరిశీలించారు. వేలి ముద్రల నిపుణులను పిలిపించి, ఆధారాలు సేకరించారు. అనంతరం ఆర్టీసీ చౌరస్తాలోని పోలీసు కమాండ్ కంట్రోల్ రూంలో సీసీ ఫుటేజీలను పరిశీలించారు. దొంగలను త్వరలోనే పట్టుకుంటామని ఏసీపీ అన్నారు. ప్రతీకాలనీ, అపార్ట్‌మెంట్‌లో సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

జనగామలో అంతర్రాష్ట్ర దొంగల ముఠా?



జనగామ: జనగామ జిల్లాకేంద్రంలోకి అంతర్ రాష్ట్ర దొంగలముఠా ప్రవేశించినట్లు పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. గురువారం రాత్రి ఒకేరోజు ఆరు ఇళ్లలో చోరీకి పాల్పడ్డారు. ఈ పని అంతర్రాష్ట్ర దొంగల ముఠాదేనని భావిస్తున్నారు. బీహార్, మధ్యప్రదేశ్‌కు చెందిన ముఠాగా పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించినట్లు సమాచారం. దీనిపై రాష్ట్ర డీజీపీ సైతం స్పందించడంతో.. వరంగల్ కమిషనర్ డాక్టర్ రంగనాథ్.. వెస్ట్‌జోన్ పోలీసులను అప్రమత్తం చేశారు. డీసీపీ పి.సీతారాం ఆధ్వర్యంలో ఏసీపీ దేవేందర్‌రెడ్డి పర్యవేక్షణలో సీఐ ఎలబోయిన శ్రీనివాస్, క్రైం విభాగంతో పాటు ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. కాలనీల వారీగా సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. ఈ నెల12వ తేదీన ఉమ్మడి నల్లగొండ జిల్లాలో తాళాలు వేసిన ఇళ్లను టార్గెట్ చేసిన దొంగలు.. రెండు రోజులు గడవకముందే జనగామ జిల్లా కేంద్రంలో వరుస దొంగతనాలకు పాల్పడ్డారు. నడుముకు కంకర రాళ్లు.. చేతిలో ఇనుప రాడ్లు పట్టుకుని చోరీలకు పాల్పడుతున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైనట్లు సమాచారం. చోరీలకు పాల్పడే సమయంలో అడ్డు వస్తే.. విచక్షణ రహితంగా దాడిచేసే అవకాశం ఉందని భావిస్తున్నారు. దీంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు.

ఏమార్చి డబ్బులు డ్రా

- రూ.3 లక్షలు చోరీ
- రూ.1.50 లక్షలు రికవరీ

ఏటూరునాగారం: కన్నాయిగూడెం మండలం మలకపల్లి గ్రామానికి చెందిన కురుసం దినేశ్ గతేడాది ప్రైవేట్ బోరుబావుల వద్ద టెక్నీషియన్‌గా పని చేస్తున్న క్రమంలో విద్యుత్ ప్రమాదంలో మృతి చెందాడు. ఈ క్రమంలో ఇన్సూరెన్స్ కింద దినేశ్ భార్య కురుసం లక్ష్మికి రూ.10 లక్షలు డబ్బులు వచ్చాయి. అందులో నుంచి రూ.3 లక్షలు పలు అవసరాలకు ఖర్చు చేసుకుంది. ఏటూరునాగారం మండల కేంద్రంలోని పంజాబ్ నేషనల్ బ్యాంకులో మిగతా రూ.7 లక్షలు జమ చేసుకుంది. ఈక్రమంలో కురుసం లక్ష్మి కుమారుడు బానయ్య తరచూ వచ్చి బ్యాంక్‌లో డబ్బులు అవసరం ఉన్నంత డ్రా చేసుకున్నాడు. ఈక్రమంలోనే బానయ్యకు స్నేహితుడైన సల్లూరి రంజిత్ బానయ్యను, లక్ష్మిని ఏమార్చి ఆధార్, పాస్‌బుక్కును దొంగిలించాడు. ఈక్రమంలో రంజిత్ తల్లి పేరు కూడా లక్ష్మి కావడంతో తమ డబ్బులు కావాలని బ్యాంకులో కురుసం లక్ష్మి మాదిరిగానే వేలిముద్రలు వేసుకొని ఆరుసార్లు రూ.50 వేల చొప్పున మొత్తం రూ.3 లక్షలు రంజిత్ డ్రా చేశాడు. ఈనెల 12న కురుసం లక్ష్మి ముప్పనపల్లిలోని పీఎన్‌బీ సర్వీస్ సెంటర్‌కు వెళ్లి రూ.10 వేలు డ్రా చేసింది. మిగతా డబ్బులు ఎన్ని ఉన్నాయని అడగ్గా రూ.90 వేలు ఉన్నాయని చెప్పడంతో ఖంగుతిన్నది. అకౌంట్‌లో రూ.3.90 లక్షలు ఉండాలని కుమారుడితో కలిసి ఏటూరునాగారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈమేరకు బ్యాంకులో ఉన్న సీసీ ఫుటేజీలు పరిశీలించారు. ఇందులో రంజిత్ అతడి తల్లి లక్ష్మిని తీసుకొని బ్యాంక్‌కు వచ్చినట్లు గుర్తించారు. కాగా.. మళ్లీ బ్యాంక్‌లో డబ్బు డ్రా చేసే క్రమంలో సాక్షి సంతకం కావాలని అధికారులు అడిగారు. అనంతరం సాక్షి సంతకాన్ని కూడా రంజిత్ ఫోర్జరీ చేసిన విషయాన్ని బ్యాంక్ అధికారులు పసిగట్టారు. అతడిపై నిఘా వేసి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వచ్చే క్రమంలో రంజిత్, అతడి తల్లి లక్ష్మి పారిపోయారు. శుక్రవారం బస్టాండ్‌లో తనిఖీలు చేస్తుండగా రంజిత్, లక్ష్మిని అదుపులోకి తీసుకొని విచారించి అతడి వద్ద నుంచి రూ.1.50 లక్షలు నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై రమేశ్ తెలిపారు.

అంబేడ్కర్ విగ్రహం వద్ద గేటుకు తాళం

అంబేడ్కర్ జయంతి సందర్భంగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసేందుకు ముఖ్య అతిథులు 10 గంటలకు వస్తారని, అప్పటివరకు ఎవరూ పూలమాలలు వేయకూడదని షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారులు అంబేడ్కర్ విగ్రహం వద్ద గేటుకు తాళం వేసి లోపలికి ఎవరూ వెళ్లకుండా సిబ్బందిని కాపలా పెట్టారు. దీంతో ఉదయం 8 గంటలకే అక్కడికి చేరుకున్న కొందరు కుల సంఘాల నాయకులు అంబేడ్కర్ అందరివాడు అంటూ.. గేటుకు తాళం వేసి అవమాన పర్చారంటూ అసహనం వ్యక్తం చేశారు.

– సాక్షి, స్టాఫ్‌ఫొటోగ్రాఫర్, మహబూబాబాద్


గేటుకు తాళం వేసి ఎవరూ లోపలికి వెళ్లకుండా కాపలా కూర్చున్న సిబ్బంది, (ఇన్‌సెట్‌లో) గేటుకు తాళం

జల్సాల కోసం చోరీలు

- ఇంటిదొంగతో జతకట్టిన స్నేహితుల గుట్టురట్టు
- రూ.4 లక్షల విలువైన బ్యాటరీలు, టీవీలు, ల్యాప్‌ట్యాప్ స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఏఎస్పీ చెన్నయ్య


నిందితులను చూపుతున్న ఏఎస్పీ చెన్నయ్య

బయ్యారం: జల్సాలకు అలవాటు పడిన ఏడుగురు స్నేహితులు చోరీలకు పాల్పడుతూ.. మహబూబాబాద్ జిల్లా బయ్యారం పోలీసులకు చిక్కారు. బయ్యారం పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అడిషనల్ ఎస్పీ జె.చెన్నయ్య వివరాలు వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ పట్టణంలోని కృష్ణకాలనీకి చెందిన కొప్పు కౌశిక్‌కుమార్ డీఎంహెచ్ఓ కార్యాలయంలో వ్యాక్సినేషన్ టెక్నీషియన్(కాంట్రాక్టు ఉద్యోగి)గా రెండేళ్ల నుంచి పని చేస్తున్నాడు. ఈక్రమంలో జిల్లాలోని పీహెచ్‌సీల్లో వాక్సినేషన్ సెంటర్లలో టెక్నికల్ పనుల కోసం కౌశిక్ కుమార్ తన స్నేహితులతో కలిసి వెళ్లేవాడు. దీంతో నెలవారీగా వచ్చే జీతం అవసరాలకు సరిపోక తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలని పీహెచ్‌సీల్లో ఉన్న ఎలక్ట్రానిక్ వస్తువులను చోరీ చేయాలని పథకం పన్నాడు. ఇందులో భాగంగా మహబూబాబాద్ పట్టణానికి చెందిన తన స్నేహితులైన ఆగుర్తి లోకేశ్, దరావత్ సుధీర్, ఆగుర్తి పునిత్, మోర్ల సందీప్‌కుమార్, ఎర్రంశెట్టి సాయి నాయుడు, గండె శివసాయితో కలిసి చోరీలు ప్రారంభించాడు. వీరంతా కలిసి జిల్లాలోని బయ్యారం, గార్ల, కురవి, కేసముద్రం, నెల్లికుదురు, గూడూరు మండలాల్లోని పీహెచ్‌సీల్లో ఉన్న టీవీలు, ఇన్వర్టర్ బ్యాటరీలు, కంప్యూటర్ వస్తువులు, సౌండ్, సెటాప్‌బాక్స్‌లను దొంగిలించారు.

దొంగసొమ్మును వాటాలేసుకున్నారు..

6 పీహెచ్‌సీల్లో సుమారు రూ.4 లక్షల విలువైన వస్తువులను దొంగిలించిన ఏడుగురు ఆవస్తువులను సమానంగా వాటాలేసుకున్నారు. ఈవాటాల ప్రకారం తమకు వచ్చిన వస్తువులను ఇళ్లల్లో దాచిపెట్టుకున్నారు. కాగా.. వీరిలో కొప్పు శివకుమార్ తన వాటాగా వచ్చిన బ్యాటరీని ఇల్లందులో విక్రయించేందుకు స్కూటీపై వెళ్తుండగా.. బయ్యారం పోలీసుల వాహన తనిఖీల్లో పట్టుబడ్డాడు. అతడిని అదుపులోకి తీసుకొని విచారించగా.. మిగతా వ్యక్తుల వివరాలు బయటపడ్డాయి. దొంగలించిన సొమ్ముతో పాటు దొంగతనాలకు ఉపయోగించిన మూడు స్కూటీలను నిందితులు అప్పజెప్పారు. పీహెచ్‌సీల్లో దొంగతనాలకు పాల్పడుతున్న వారిని పట్టుకున్న బయ్యారం ఎస్సై రమాదేవి, సహకరించిన గార్ల ఎస్సై వెంకన్నతో పాటు సిబ్బంది, ఐటీ కోర్ సిబ్బందిని ఏఎస్పీ అభినందించారు. నిందితులను పట్టుకున్న అధికారులు, సిబ్బందికి త్వరలో ఎస్పీ చేతుల మీదుగా రివార్డులు అందిస్తామని ఏఎస్పీ వెల్లడించారు. సమావేశంలో డీఎస్పీ రమణబాబు, గార్ల–బయ్యారం సీఐ బాలాజీ, బయ్యారం, గార్ల ఎస్సైలు రమాదేవి, వెంకన్న, ఏఎస్సై రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రి ఎదుట మృతదేహంతో ఆందోళన

- డాక్టర్ రాజుపై కేసు నమోదు చేయాలని డిమాండ్


లక్ష్మణ్(ఫైల్)


ఆస్పత్రి ఎదుట మృతదేహంతో ఆందోళన చేస్తున్న మృతుడి కుటుంబీకులు

హన్మకొండ చౌరస్తా/ఎల్కతుర్తి: హనుమకొండ కొత్త బస్టాండ్ సమీపంలోని రాజు ఈఎన్‌టీ ఆస్పత్రి ఎదుట శుక్రవారం బాధిత కుటుంబసభ్యులు ఆందోళనకు దిగారు. వైద్యుడి నిర్లక్ష్యంతో మృతి చెందాడని ఆరోపిస్తూ.. మృతదేహాన్ని ఆస్పత్రి ఎదుట ఉంచి ధర్నా చేపట్టారు. హనుమకొండ పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని న్యాయం చేస్తామని బాధితులకు భరోసా ఇవ్వడంతో ఆందోళన విరమించారు. మృతుడి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండ జిల్లాలోని భీమదేవరపల్లి మండలం వంగర గ్రామానికి చెందిన గుడాటి లక్ష్మణ్(45)కు ముక్కులో మాంసం పెరగడంలో ఆపరేషన్ కోసం స్థానిక ఆర్ఎంపీ కృష్ణంరాజు సూచన మేరకు ఈనెల 8న లక్ష్మణ్ హనుమకొండలోని రాజు ఈఎన్‌టీ ఆస్పత్రికి వచ్చాడు. పరీక్షించిన వైద్యులు ఆపరేషన్ చేయడానికి ముందుగా అనస్తీషియా ఇచ్చారు. డోస్ ఎక్కువ కావడంతో ఫిట్స్ వచ్చిందని చెప్పి వేరే ఆస్పత్రికి తీసుకెళ్లాలని సూచించారు. రాజు ఈఎన్‌టీ ఆస్పత్రి నుంచి సుబేదారిలోని రోహిణికి తీసుకెళ్లగా పరిస్థితి విషమంగా ఉందని, హైదరాబాద్‌కు తీసుకెళ్లాలని అక్కడి వైద్యులు సూచించారు. దీంతో కుటుంబీకులు అతడిని హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. అక్కడి వైద్యులు చికిత్స చేసినప్పటికీ లక్ష్మణ్ మృతి చెందాడు. కమీషన్ కోసం ప్రాణాలను ఫణంగా పెట్టిన ఆర్ఎంపీ కృష్ణంరాజు, నిర్లక్ష్యంగా చికిత్స చేసిన వైద్యుడిపై కేసులు నమోదు చేయాలని మృతుడి బంధువులు డిమాండ్ చేశారు. సుమారు రెండు గంటల పాటు మృతదేహంతో ఆస్పత్రి ఎదుట ఆందోళన చేశారు. ఘటనా స్థలికి చేరుకున్న హనుమకొండ పోలీసులు విచారణ జరిపి తగిన న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో మృతదేహాన్ని తీసుకుని వెళ్లిపోయారు. కాగా.. ఈ విషయంపై డాక్టర్ రాజును వివరణ కోరగా.. వారం క్రితం సైనసైటిస్ ఆపరేషన్ కోసం లక్ష్మణ్ ఆస్పత్రికి వచ్చాడని, ఆపరేషన్ పూర్తయిన 40 నిమిషాలకు ఫిట్స్ రావడంతో రోహిణికి తీసుకెళ్లాలని సూచించినట్లు తెలిపారు. అత్యాధునిక వైద్య పరికరాలతో ఆపరేషన్ చేసినట్లు పేర్కొన్నారు. చికిత్సలో తమ నిర్లక్ష్యం లేదని పేర్కొన్నారు.

‘బలగం’ మొగిలయ్యకు మంత్రి పరామర్శ


నిమ్స్‌లో మొగిలయ్యను పరామర్శిస్తున్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

దుగ్గొండి: బలగం సినిమాలో కోట్లాది మందిని తన పాట ద్వారా కంట తడి పెట్టించిన పస్తం(బలగం) మొగిలయ్య రెండు కిడ్నీలు పాడవడడంతో పాటు గుండె నొప్పి రావడంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈమేరకు మొగిలయ్యను శుక్రవారం రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్ ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు. మొగిలయ్యతో మాట్లాడి ధైర్యం చెప్పారు. వైద్య ఖర్చులన్నీ ప్రభుత్వమే భరిస్తుందని, ఆందోళన చెందవద్దన్నారు. మొగిలయ్య ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. కన్నీరు మున్నీరుగా విలపిస్తున్న మొగిలయ్య భార్య కొంరమ్మను ఓదార్చారు. మొగిలయ్య సంపూర్ణ ఆరోగ్యవంతుడిగా ఇంటికి చేరతాడని ఎలాంటి ఆందోళన చెందవద్దని ఆమెకు సూచించారు. తరిగిపోతున్న ప్రాచీన జానపద సంపదను ప్రపంచానికి పరిచయం చేసిన ఘనత మొగిలయ్య దంపతులదేనని ఆయన అన్నారు.

అన్నను హత్య చేసిన తమ్ముడు


శంకర్ మృతదేహం

వరంగల్ క్రైం: నాలుగు పదుల వయస్సు దాటినా.. పెండ్లి చేసుకోని ఇద్దరు అన్నదమ్ములు వీరి మధ్య చిన్న గొడవలు కాస్తా హత్యకు దారి తీశాయి. ఈఘటన హనుమకొండ పోలీస్‌స్టేషన్ పరిధి కుమార్‌పల్లిలో గురువారం రాత్రి జరిగింది. హనుమకొండ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌జీ తెలిపిన వివరాల ప్రకారం.. గొర్రె రాధాబాయి, నర్సయ్య దంపతులకు ముగ్గురు కుమారులు గొర్రె శంకర్ (46), గొర్రె రాజ్‌కుమార్ (44) వీరిద్దరికీ వివాహం కాలేదు. వీరు తల్లి రాధాబాయితో కుమార్‌పల్లిలో కలిసి ఉంటున్నారు. రెండో కుమారుడు రాజ్‌కుమార్ ఐదేళ్ల నుంచి ఒక మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడని. ఈ విషయంలో ఇద్దరు అన్నదమ్ముల మధ్య తరచూ గొడవలు జరగుతుండేవి. గురువారం రాత్రి కుమార్‌పల్లిలోని బుద్ధభవన్‌లో జరిగిన కార్యక్రమానికి హాజరైన అన్నదమ్ములు ఇంటికి వచ్చారు. పడుకునే స్థలం విషయంలో గొడవ జరగడంతో రాజ్‌కుమార్ గొడ్డలితో శంకర్ ముఖం, ఛాతిపై నరికాడు. ఆతర్వాత పరారయ్యాడు. మృతుడి తల్లి గొర్రె రాధాబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నట్లు ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌జీ తెలిపారు.

భార్య కాపురానికి రావట్లేదని ఆత్మహత్య

కేసముద్రం: భార్య కాపురానికి రావట్లేదని ఇనుగుర్తి మండలం లాలుతండా జీపీ శివారు రాముతండాకు చెందిన లకావత్ స్వామి(35) గురువారం ఆత్మహత్య చేసుకున్నాడు. స్వామి, జ్యోతి దంపతులకు కొంత కాలంగా గొడవలు జరుగుతున్నాయి. ఈక్రమంలో 20 రోజుల క్రితం జ్యోతి కూతుర్ని తీసుకుని పుట్టింటికి వెళ్లిపోయింది. గురువారం స్వామి తన భార్యకు ఫోన్ చేసి ఇంటికి రావాలని అడిగాడు. దీంతో ఆమె రానని చెప్పడంతో, మనస్తాపం చెందిన అతడు ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చికిత్స నిమిత్తం మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో అదేరోజు రాత్రి మృతి చెందాడు. మృతుడి తల్లి నాగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై తిరుపతి తెలిపారు.

అదనపు కట్న వేధింపులతో వివాహిత..

ధర్మసాగర్: అదనపు కట్న వేధింపులతో కాజీపేట మండలం రాంపూర్‌కు చెందిన సోమారపు రష్మిక(31) గురువారం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. వరంగల్ శివనగర్‌కు చెందిన రష్మికకు రాంపూర్ గ్రామానికి చెందిన సోమారపు మల్లయ్యతో 2021లో వివాహం జరిగింది. వివాహ సమయంలో కట్నకానుకలు ఇచ్చారు. ఆ తర్వాత కొన్ని నెలలకు మల్లయ్య, అతడి కుటుంబసభ్యులు రష్మికను అదనపు కట్నం తేవాలని ప్రతీరోజు శారీరకంగా, మానసికంగా వేధించేవారు. చాలాసార్లు పెద్దలు మాట్లాడినా.. మల్లయ్యలో మార్పు రాలేదు. వీరికి ఒక కూతురు జన్మించినప్పటికీ మల్లయ్య వేధింపులు మానుకోలేదు. దీంతో భర్త వేధింపులు తట్టుకోలేక రష్మిక గురువారం సాయంత్రం ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యతో సామాజిక పరివర్తన

- అంబేడ్కర్ వర్సిటీ ఆచార్యులు సుధారాణి


మాట్లాడుతున్న ఆచార్యులు సుధారాణి

కేయూ క్యాంపస్: సామాజిక పరివర్తన కోసం విద్య ఉపయోగపడుతుందని సామాజిక అసమానాతలు రూపుమాపినప్పుడే అంబేడ్కర్‌కు నిజమైన నివాళి అని హైదరాబాద్‌లోని అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ హిస్టరీ విభాగం ఆచార్యులు సుధారాణి అన్నారు. కేయూలో ఎస్సీ, ఎస్టీ సెల్ ఆధ్వర్యంలో శుక్రవారం కేయూ రిజిస్ట్రార్ అధ్యక్షతన కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాలలో నిర్వహించిన అంబేడ్కర్ జయంతి సభలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

అభ్యర్థులకు సన్మానం

కేయూలో డాక్టరేట్‌లు పొందిన ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులను రిజిస్ట్రార్, ప్రొఫెసర్లు ఘనంగా సన్మానించా రు. శాలువాలు కప్పి, జ్ఞాపికలే అందజేశారు. గతేడాది ఉద్యోగ విరమణ పొందిన ఆచార్యులు కె.డేవిడ్‌ను, జి.వీరన్నను సన్మానించారు.

విగ్రహానికి నివాళులు

కేయూ దూర విద్యాకేంద్రం ఆవరణలో అంబేడ్కర్ విగ్రహానికి కేయూ రిజిస్ట్రార్ ఆచార్య టి.శ్రీనివాస్‌రావు ఇతర ఆచార్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కేయూ రిజిస్ట్రార్ ఆచార్య టి.శ్రీనివాస్‌రావు, కేయూ అంబేడ్కర్ స్టడీ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ ఎల్‌పీ రాజ్‌కుమార్, పాలకమండలి సభ్యులు టి.మనోహర్, పి.మల్లారెడ్డి, సుమితీ ఉమామహేశ్వరి, యూనివర్సిటీ ఆర్ట్స్‌అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ బన్న అయిలయ్య, క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ సురేశ్‌లాల్, కేయూ సీడీసీ డీన్ వి.రాంచంద్రం, కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ పి.వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి అంబేడ్కర్: టీఎస్ ఎన్పీడీసీఎల్ సీఎండీ


హన్మకొండ: చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సీఎండీ ఎ.గోపాల్‌రావు, డైరెక్టర్లు

హన్మకొండ: సామాజిక, ఆర్థిక అసమానతల్లేని సమాజం దిశగా దేశాన్ని ముందుకు తీసుకెళ్లిన బహుముఖ ప్రజ్ఞాశాలి బీఆర్ అంబేడ్కర్ అని టీఎస్ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ అన్నమనేని గోపాల్‌రావు అన్నారు. శుక్రవారం హనుమకొండలోని ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో అంబేడ్కర్ జయంతిని జరుపుకున్నారు. చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు బి.వెంకటేశ్వర్‌రావు, పి.గణపతి, పి.సంధ్యారాణి, వి.తిరుపతిరెడ్డి, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ బి.జనార్దన్, కార్యదర్శి కె.వెంకటేశం, జాయింట్ సెక్రటరీ కె.రమేశ్, సీజీఎంలు, జీఎంలు, అధికారులు, ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

మండే ఎండల్లోనూ... అందంగా... ఆరోగ్యంగా



ఎండాకాలం కాసేపు బయటికి వెళితే చాలు ముఖ చర్మం కమిలిపోతుంది. విపరీతంగా చెమటలు పోస్తాయి. నీరసం, నిస్త్రాణ కలుగుతాయి. కాసేపు పని చేస్తే చాలు శరీరం అలసిపోయి, సొమ్మసిల్లినట్లు అవుతుంది. బయటికి వెళ్లేటప్పుడు కొన్ని చిట్కాలు పాటిస్తే ఎండల్లోనూ అందంగా ఆరోగ్యంగా ఉండవచ్చు. అవేమిటో చూద్దాం...

మంచి నీటిని మించిన ఔషధం లేదు. శరీరం డీహైడ్రేషన్‌కు గురికాకుండా కాపాడేది మంచినీరు మాత్రమే. కాబట్టి ఇప్పటి నుంచీ దాహం వేసినా వేయకపోయినా వీలైనంత ఎక్కువగా నీళ్లు తాగడం అలవాటుగా మార్చుకోండి.

● గుప్పెడు పుదీనా ఆకులను తాగే నీటిలో వేసుకుంటే... శరీరం చల్లగా ఉంటుంది. ఈ కాలంలో పుదీనా టీని ఎంచుకుంటే మరీ మంచిది. ఎండ ప్రభావాన్ని కొంతవరకూ తట్టుకోగలుగుతారు.

● నిమ్మరసం వేసవికి ఔషధం లాంటిది. ఉదయాన్నే గ్లాసు నీటిలో కొద్దిగా నిమ్మరసం, తేనె కలిపి తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారు.

● ఉప్పు, కొద్దిగా మసాలాలు జోడించి పెరుగు చిలికి చేసే మజ్జిగ శరీరంలో వేడిని చల్లారుస్తుంది. డీహైడ్రేషన్ ను నివారిస్తుంది. ఇది ఎలక్ట్రోలైట్ల భరితం. వేసవి తాపంతో పోరాడటానికి మజ్జిగ ఒక మంచి ఆప్షన్. దీనిలో క్యాలరీలు తక్కువ. కాల్షియం, పొటాషియంతో పాటు ప్రొటీన్ కూడా దీని నుంచి దొరుకుతుంది. అసిడిటీని తగ్గిస్తుంది. జీర్ణవ్యవస్థ ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. అదేవిధంగా పెరుగు తీసుకోవడం కూడా మంచిదే.



● గసగసాలను ఎక్కువగా ఆహారపదార్థాల్లో వాడాలి. వీటిలోని యాంటీ ఆక్సిడెంట్లు వ్యాధినిరోధక శక్తిని పెంచుతాయి. అంతే కాదు, వేడిని తగ్గించి, శరీరాన్ని చల్లగా ఉంచుతాయి. ● కొత్తిమీరను ఆహారంలో అధికంగా తీసుకోవాలి. కొత్తిమీర రసం లేదా వంటకాల్లో దీన్ని వాడినా... శరీరంలోని అధిక ఉష్ణోగ్రత అదుపులో ఉంటుంది.

చర్మ సంరక్షణ ముఖ్యం

● వేసవిలో సన్‌స్క్రీన్ లోషన్‌ని రాసుకోవడం వల్ల చర్మానికి సమస్యలు తగ్గుతాయి. ఈ సన్‌స్క్రీన్ లోషన్‌ని బయటికి వెళ్లినప్పుడు మాత్రమే కాకుండా ఇంట్లో ఉన్నప్పుడు కూడా అప్లై చేసుకోండి. సన్‌స్క్రీన్ లోషన్ వాడటం వల్ల చర్మ సమస్యలు ఉండవు. అలాగే చర్మానికి రక్షణ ఉంటుంది.

● ఎండల్లో బయటకు వెళ్ళినప్పుడు చర్మాన్ని కవర్ చేసుకోవడం అవసరం. కాబట్టి మీరు బయటకు వెళ్లేటప్పుడు గొడుగుని తీసుకువెళ్లడం మర్చిపోకండి. అలానే ఎండాకాలంలో బయటకు వెళ్ళేటప్పుడు సన్ గ్లాసెస్‌ని ధరించడం, తలకు పెద్ద టోపీ పెట్టుకోవడం పైగా ఎలాంటి సమస్యలూ రావు.

● వేసవిలో ఆయిల్ ఫుడ్స్‌కి దూరంగా ఉండాలి. ఇంటి వంటలలో కూడా నూనె వాడకం తగ్గించాలి. ● ఆకుకూరలు ఎక్కువగా తీసుకోవాలి. మసాలా కూరలు తగ్గించాలి. ● అల్పాహారంగా ఆవిరి కుడుములు, ఇడ్లీ వంటివి తీసుకుంటే మేలు. ● కర్బూజా, పుచ్చకాయలు, ఈత కాయలు, తాటి ముంజలు వంటి సీజనల్ పండ్లు ఆరోగ్యానికి చాలా మంచిది. ● వేసవిలో రోజుకోసారి రాగిజావ తీసుకోవడం వల్ల కడుపులో చల్లగా ఉండటంతోపాటు మరెన్నో లాభాలు ఉన్నాయి. రాగుల్లో క్యాల్షియం పుష్కలంగా ఉంటుంది. దీన్ని ప్రతిరోజూ తీసుకోవడం వల్ల ఎముకలు దృఢంగా ఉంటాయి.

నీళ్లు ఏ బాటిల్‌లో తాగుతున్నారు..?

అసలే ఎండాకాలం.. దాహం వేస్తుంటుంది. ఇంట్లో ఉన్నప్పుడంటే కావలసినప్పుడల్లా నీళ్లు తాగుతుంటాం. మరి బయటికి వెళ్లేటప్పుడు? అందులో ఆలోచించేదేముంది... ఒక వాటర్ బాటిల్ తీసుకెళతాం.. అంతే కదా అని సింపుల్‌గా చెప్పేస్తాం. అయితే ఆ బాటిల్ దేనితో తయారు చేసింది... అంటే నూటికి తొంభై పాళ్లు 'ప్లాస్టిక్ బాటిల్' అనే సమాధానం వస్తుంది. దాహం వేసినప్పుడు నీళ్లు తాగడం వల్ల ఎంత ఉపయోగమో, ప్లాస్టిక్ బాటిల్స్‌లో నీళ్లు తాగడం అంత ప్రమాదం. అది ఎండాకాలం అయితే కనక ఈ ప్రమాదం ఇంకా ఎక్కువగా ఉంటుంది. ఇంతకీ ఏమిటా నష్టాలు అంటారా? అదే చూద్దాం..

ప్లాస్టిక్ వాడకం పర్యావరణానికి ముప్పు అని పదే పదే చెబుతున్నా కూడా ప్లాస్టిక్ ఇంకా వాడకంలోనే ఉండటానికి కారణం ఏమిటంటే, దానిని క్యారీ చేయడం చాలా సులువు. నిర్వహించడం ఇంకా సులువు. ఒకవేళ ఎక్కడైనా పెట్టి మరచిపోయినా పెద్ద ఖరీదు ఉండదు కాబట్టి దిగులు పడనక్కరలేదు. అందువల్ల పర్యావరణ ప్రేమికులు ఎంతగా నెత్తీ నోరు బాదుకుంటున్నా, ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించే విషయంలో వెనకబడవలసి వస్తోంది.

● ప్లాస్టిక్ వాటర్ బాటిల్స్ అయినా, భారీ ప్లాస్టిక్ కంటైనర్లు అయినా వాటి నుంచి నీరు తాగడం ప్రమాదకరం. ముఖ్యంగా ఎండలో ఎక్కువగా ఉంచిన ప్లాస్టిక్ బాటిల్స్‌లోని నీటిని అసలు తాగకూడదు. ● పరిశోధన ప్రకారం.. ప్లాస్టిక్ బాటిల్స్ మీద ఎండ పడితే.. అవి మైక్రోప్లాస్టిక్‌లను విడుదల చేస్తాయి. అలాంటి పరిస్థితుల్లో మనం ఈ నీటిని తాగితే.. శరీరంలోని హార్మోన్ల సమతుల్యతను కాపాడే.. ఎండోక్రైన్ వ్యవస్థ ప్రభావితం అవుతుంది. ఇలాంటి నీటిని ఎక్కువగా తీసుకుంటే.. ఆరోగ్యం దెబ్బతింటుంది. కాలేయాన్ని కూడా పాడు చేస్తుంది.



● ఎండలో ఉండే.. ప్లాస్టిక్ బాటిల్ నుంచి డయాక్సిన్ లాంటి టాక్సిన్స్ నీటిలోకి విడుదల అవుతుంది. ఈ డయాక్సిన్ నీటిని తాగితే.. బ్రెస్ట్ క్యాన్సర్ వచ్చే అవకాశం ఉంది. ప్లాస్టిక్ బాటిల్ నీళ్లు తాగితే.. వ్యాధి నిరోధక శక్తి కూడా తగ్గుతుంది. మగవారిలో శుక్ర కణాల సంఖ్య కూడా తగ్గవచ్చు.

బాటిల్ వాటర్‌లో మైక్రో ప్లాస్టిక్స్ స్థాయిలు ఎక్కువగా ఉంటాయని అధ్యయనాలు చెబుతున్నాయి.

● మైక్రోప్లాస్టిక్స్ కలిసిన నీటిని తాగితే పొత్తి కడుపునకు సంబంధించిన అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉంటుంది. హార్మోన్ల అసమతుల్యం, పీసీఓఎస్, ఒవేరియన్ సమస్యలు, బ్రెస్ట్ క్యాన్సర్, కోలన్ క్యాన్సర్, ప్రోస్టేట్ క్యాన్సర్, ఇతర అనారోగ్య సమస్యలు రావొచ్చు.

● ప్లాస్టిక్ బాటిల్స్‌లో నీటిని తాగితే ఆరోగ్యానికి మంచిది కాదు. బయటకు వెళ్లినప్పుడు ప్లాస్టిక్ బాటిళ్లకు ఎండ తగిలితే.. అస్సలే తాగొద్దు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ బాటిళ్లను కొంతమంది అలానే ఉపయోగిస్తారు. ఇంటికి తీసుకొచ్చి ఫ్రిడ్జ్‌లో పెట్టుకుంటారు. ఇది ఇంకా అపాయకరమైనది. ఇలా అస్సలు చేయొద్దు ఎప్పుడూ.

ఏం చేయాలి మరి?

ప్లాస్టిక్ బాటిల్స్ అంతగా వాడుకలోకి రాని రోజుల్లో పెద్దవాళ్లు ఎక్కడికైనా వెళ్లేటప్పుడు స్టీలు లేదా ఇత్తడి మరచెంబులు తీసుకు వెళ్లేవారు. ఇప్పుడు కూడా అదే మంచిది. అందుకు తగ్గట్టు ఇప్పుడు మార్కెట్‌లో రకరకాల సైజుల్లో, ఆకారాలలో రాగి, స్టీలు, ఇత్తడి బాటిల్స్ అందుబాటులోకి వచ్చాయి. ఇవి కాస్తంత ఖరీదు ఎక్కువైనా, ప్లాస్టిక్ వాడకం వల్ల తలెత్తే అనారోగ్య సమస్యలతో పోల్చుకుంటే ఫరవాలేదనిపిస్తుంది.

● ప్లాంట్ బేస్డ్ బాటిల్స్, గాజుసీసాలు, అల్యూమినియం వాటర్ క్యాన్స్ కూడా అందుబాటులోకి వస్తున్నాయి. మనం వాడకం మొదలు పెడితే ధరలు కూడా అందుబాటులోనే ఉంటాయి.

మీకు తెలుసా?



రోజంతా చురుకుగా, ఆరోగ్యంగా ఉండాలంటే అల్పాహారం తీసుకోవడం అవసరం. దీనిలో మొలకెత్తిన గింజలు, ఉడికించిన కోడిగుడ్లు, నూనె లేకుండా చేసిన చపాతీలు, పండ్ల రసాలే కాక... ఐదు నానబెట్టిన బాదం పప్పులు, పండ్లు, కూరగాయలతో కలగలిపిన సలాడ్ లు వంటివి తీసుకుంటుంటే అనారోగ్యాన్ని కలిగించే వైరల్ ఇన్‌ఫెక్షన్‌లు దరిచేరవు. వీటితోపాటు.. తీసుకునే అల్పాహారంగా కార్బోహైడ్రేట్లు సమృద్ధిగా ఉండే ఆహారపదార్థాలు తీసుకోవడం వల్ల ఒత్తిడి తగ్గడమే కాకుండా, జ్ఞాపకశక్తి పెరుగుతుంది. అలాగే డైటింగ్ చేసే వారు నిర్లక్ష్యం చేయకుండా.. అల్పాహారం తీసుకోవడం మరువకూడదు.

గ్యాస్ ఆదా చేద్దామా?

ఇంచుమించు ప్రతి ఇంట్లోనూ ఇప్పుడు వంటకు గ్యాసే వాడుతున్నారు. దాంతో వంట గ్యాస్ ధర రోజురోజుకీ పెరిగి మంట గ్యాస్‌గా మారిపోతోంది. అందుకే దాన్ని సమర్థవంతంగా ఉపయోగించుకుంటే ఎక్కువకాలం పాటు గ్యాస్ వచ్చే విధంగా చూసుకోవచ్చు. గ్యాస్ ఆదాకు చిట్కాలు తెలుసుకుందాం...



వంట చేసేటప్పుడు రోజులో ఒకేసారి ఎక్కువ మొత్తంలో కూర వండుకోవడం మంచిది. ఉదయం ఒకసారి, మధ్యాహ్నం ఒకసారి, రాత్రి ఒకసారి... ఇలా వండడం వల్ల గ్యాస్ ఎక్కువ మొత్తంలో పోతుంది. అదే మధ్యాహ్న భోజనం చేయడానికి ఒక గంట ముందు వండుకుంటే, అదే కూర మధ్యాహ్నానికి, రాత్రికి కూడా వస్తుంది. దీనివల్ల రెండు మూడుసార్లు గ్యాస్‌ను వాడాల్సిన అవసరం రాదు.

● **ప్రెషర్ కుకర్ బెస్ట్:** ప్రెషర్ కుకర్ అధిక పీడనం కింద ఆవిరి మీద ఆహారాన్ని ఉడికిస్తుంది పైగా రెండు మూడు రకాలను ఒకేసారి కుకర్‌లో పెట్టవచ్చు కాబట్టి తక్కువ సమయంలో వంట పూర్తవుతుంది. గ్యాస్ కూడా ఆదా అవుతుంది.

● చిన్నగిన్నెలో వంటలు చేస్తున్నప్పుడు పెద్ద బర్నర్ వాడకూడదు. అలా వాడటం వల్ల మంట చాలా మటుకు బయటికి పోతుంది. దాంతో ఆ మేరకు గ్యాస్ వృథా అయినట్లే కదా.. అందువల్ల సాధ్యమైనంత వరకు చిన్న బర్నర్‌నే వాడటం మంచిది.

● బర్నర్లను తరచూ శుభ్రపరుస్తూ ఉండాలి. ఇలా చేయడం వల్ల అది త్వరగా వేడెక్కి వంట త్వరగా పూర్తయ్యేలా చేస్తుంది.

● వంట పూర్తవడానికి కొంచెం ముందే స్టవ్ ఆపి వేయండి. గిన్నె మీద మూత మాత్రం తీయవద్దు. లోపల ఉన్న వేడి ఆ మిగతా వంటను పూర్తి చేస్తుంది. దీనివల్ల గ్యాస్ ఆదా అవుతుంది.

● వంట చేస్తున్నప్పుడు గిన్నె మీద మూత పెట్టే ఉంచండి. ఎందుకంటే మూత పెట్టడం వల్ల లోపల ఉన్న వేడి బయటికి పోదు. ఆ వేడి మీదే త్వరగా ఉడుకుతుంది. అదేవిధంగా స్నానానికి వేడినీళ్లను గ్యాస్ మీద పెట్టవద్దు. నీళ్ల వేడెక్కడానికి చాలా సమయం పడుతుంది. దాంతో ఎక్కువ గ్యాస్ వాడాల్సి వస్తుంది.

● పగటిపూట వంట చేస్తున్నప్పుడు వంటగదిలోని లైట్లను ఆన్ చేయవద్దు. దీనివల్ల శక్తి ఆదా అవుతుంది. అలాగే మీకు తెలియకుండానే గ్యాస్ వినియోగం కూడా తగ్గుతుంది.

ఈ చిట్కాలన్నీ పాటించడం వల్ల గ్యాస్ సిలెండర్ దాదాపు పది రోజులు అదనంగా వచ్చే అవకాశం ఉంది.

సినిమా

కేరాఫ్ ఫారిన్

సమ్మర్‌లో కూల్‌గా ఉండే లొకేషన్స్‌ని ఎంచుకుని, వెకేషన్‌కి వెళుతుంటారు కొందరు స్టార్స్. కొందరిని షూటింగే చల్లని ప్రాంతాలకు తీసుకెళుతుంది. అలా 'కేరాఫ్ ఫారిన్' అంటూ షూటింగ్స్‌కి, వెకేషన్‌కి విదేశాలు వెళ్లిన స్టార్స్ గురించి తెలుసుకుందాం.



● కమల్‌హాసన్



● ప్రభాస్



● అక్షయ్ కుమార్, టైగర్ ష్రాఫ్


● రెండు వారాలుగా ఫారిన్‌లోనే ఉంటున్నారు ఇండియన్. హీరో కమల్‌హాసన్, దర్శకుడు శంకర్ కాంబినేషన్‌లో 1996లో వచ్చిన 'ఇండియన్' ('భారతీయుడు') సినిమాకు సీక్వెల్‌గా 'ఇండియన్ 2' రూపొందుతున్న సంగతి తెలిసిందే. ఇటీవల తైవాన్‌లో జరిగిన ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం సౌతాఫ్రికాలో జరుగుతోంది. కమల్‌పై ఓ భారీ యాక్షన్ సీక్వెన్స్ తీస్తున్నారు శంకర్. ఈ వారం కూడా 'ఇండియన్ 2' టీమ్ సౌతాఫ్రికాలోనే ఉంటుందని తెలిసింది. కాజల్ అగర్వాల్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో రకుల్‌ప్రీత్ సింగ్, బాబీ సింహా కీలక పాత్రలు చేస్తున్నారు.

● ఇటలీలో ఫైట్స్ చేశారు ప్రభాస్. 'కేజీఎఫ్' ఫేమ్ ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో ప్రభాస్ హీరోగా 'సలార్' చిత్రం తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. ఈ సినిమా షూటింగ్ గత నెలలో ఇటలీ లొకేషన్స్‌లో జరిగింది. ముఖ్యంగా ప్రభాస్‌పై యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరించారు. కాగా 'సలార్' సినిమా యూనిట్ మరోసారి ఫారిన్ వెళ్లనుందని సమాచారం. బుడాపెస్ట్ లొకేషన్స్‌లో 'సలార్' షూటింగ్‌ను ప్లాన్ చేశారు. శ్రుతీహాసన్ హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రాన్ని విజయ్ కిరగందూర్ నిర్మిస్తున్నారు. 'సలార్' చిత్రం సెప్టెంబరు 28న విడుదల కానుంది. ఇదిలా ఉంటే... ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతున్న 'రాజా డీలక్స్' (ప్రచారంలో ఉన్న టైటిల్) చిత్రీకరణలో ప్రభాస్ పాల్గొంటున్నారని తెలిసింది. మారుతి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమా తాజా షెడ్యూల్ చిత్రీకరణ పూర్తి కాగానే 'సలార్' కోసం ప్రభాస్ ఫారిన్ ఫ్లైట్ ఎక్కుతారని ఫిల్మ్‌నగర్ సమాచారం.

● లండన్‌లో ప్రేమ పాఠాలు నేర్చుకుంటున్నారు శర్వానంద్. శ్రీరామ్ ఆదిత్య దర్శకత్వంలో శర్వానంద్, కృతీ శెట్టి జంటగా ఓ సినిమా రూపొందుతున్న సంగతి తెలిసిందే. ఇటీవల లండన్‌లో ప్రారంభమైన ఈ సినిమా షూటింగ్ ఇంకా కొనసాగుతోంది. గత వారం శర్వానంద్, కృతీపై కీలక సన్నివేశాలు, ఓ పాట చిత్రీకరించారు.



● రణ్‌బీర్ కపూర్



● శర్వానంద్

● బాలీవుడ్ 'బడే మియా చోటే మియా' లండన్‌కు షిఫ్ట్ అయ్యారు. అక్షయ్ కుమార్, టైగర్ ష్రాఫ్ హీరోలుగా అలీ అబ్బాస్ జాఫర్ దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా 'బడే మియా చోటే మియా'. ఇటీవల ఓ యాక్షన్ సీక్వెన్స్‌ను స్కాట్లాండ్‌లో చిత్రీకరించారు. అట్నుంచి అటు లండన్ వెళ్లారు. మరో పది రోజులపాటు లండన్ షెడ్యూల్ జరుగుతుందట. అలాగే మరో బాలీవుడ్ మూవీ 'యానిమల్' షూటింగ్ కూడా లండన్‌లో జరిగింది. 'అర్జున్ రెడ్డి' ఫేమ్ సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో రణ్‌బీర్ కపూర్ హీరోగా నటిస్తున్న ఈ చిత్రంలో రష్మికా మందన్నా హీరోయిన్.

ఈ చిత్రాలతో పాటు మరికొన్ని చిత్రాలు ఫారిన్ లొకేషన్స్‌లో షూటింగ్స్‌ను ప్లాన్ చేశాయి.

సమ్మర్ బ్రేక్



● మహేశ్‌బాబు



● రామ్‌చరణ్



● ఎన్టీఆర్

షూటింగ్స్‌కు సమ్మర్ బ్రేక్ ఇచ్చారు కొందరు స్టార్ హీరోలు. ప్రతి ఏడాది సమ్మర్‌కు ఫ్యామిలీతో కలిసి వెకేషన్‌కు వెళ్లే మహేశ్‌బాబు ఈ ఏడాది కూడా ఫారిన్ టూర్ వెళ్లారు. ఫ్యామిలీతో కలిసి విదేశాల్లో వెకేషన్ టైమ్‌ను ఆస్వాదిస్తున్నారు. మహేశ్ ఫ్యామిలీ ప్రస్తుతం జర్మనీలో ఉన్నట్లు తెలిసింది. ఈ ఫారిన్ వెకేషన్‌ను పూర్తి చేసుకుని వచ్చిన తర్వాత త్రివిక్రమ్ దర్శకత్వంలో తాను హీరోగా నటిస్తున్న సినిమా షూటింగ్‌లో జాయిన్ అవుతారు మహేశ్‌బాబు. మరోవైపు 'జనతా గ్యారేజ్' చిత్రం తర్వాత హీరో ఎన్టీఆర్, దర్శకుడు కొరటాల శివ కాంబినేషన్‌లో ఓ సినిమా తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. హైదరాబాద్‌లో ఇటీవల మొదలైన ఈ సినిమా తొలి షెడ్యూల్ ముగిసింది. నెక్ట్స్ షెడ్యూల్ గోవాలో ప్లాన్ చేశారు. అయితే ఈ సినిమా షూటింగ్ నుంచి ఎన్టీఆర్ స్మాల్ బ్రేక్ తీసుకున్నారని తెలిసింది. గోవా షెడ్యూల్‌లో వచ్చే నెల జాయిన్ అవుతారట ఎన్టీఆర్. ఇక రామ్‌చరణ్ ఫుల్ వెకేషన్ మోడ్‌లో ఉన్నారు. ఇటీవల రామ్‌చరణ్, ఆయన సతీమణి ఉపాసన దుబాయ్ వెళ్లొచ్చారు. ప్రస్తుతం ఈ దంపతులు మాల్దీవుల్లో ఉన్నారు. ఈ వెకేషన్‌ను పూర్తి చేసిన తర్వాత రామ్‌చరణ్ 'గేమ్ చేంజర్' షూటింగ్‌లో పాల్గొంటారు. శంకర్ దర్శకత్వంలో ఈ చిత్రం రూపొందుతోంది.

నేను సింగిల్

'ప్రస్తుతం నేను సింగిల్‌గానే ఉన్నాను.. అలా ఉండటమే నాకు ఇష్టం' అంటున్నారు హీరోయిన్ పూజా హెగ్డే. సల్మాన్ ఖాన్ హీరోగా ఫర్హాద్ సామ్జీ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'కిసీ కా భాయ్.. కిసీ కీ జాన్'. సల్మాన్ ఖాన్ ఫిల్మ్స్ సమర్పణలో రూపొందిన ఈ చిత్రం ఈ నెల 21న విడుదల కానుంది. ఈ చిత్రంలో సల్మాన్ ఖాన్‌కి జోడీగా నటించారు పూజా హెగ్డే. కాగా ఈ సినిమా షూటింగ్ జరుగుతున్నప్పటి నుంచి సల్మాన్, పూజా హెగ్డే డేటింగ్‌లో ఉన్నట్లు వార్తలు ప్రచారంలోకి వచ్చాయి. పైగా మంగళూరులో జరిగిన పూజ సోదరుడు రిషబ్ హెగ్డే వివాహానికి సల్మాన్ ఖాన్ హాజరవడం డేటింగ్ వార్తలకు మరింత బలం చేకూర్చింది. ఈ వార్తలపై తాజాగా పూజా హెగ్డే స్పందిస్తూ– ''నా గురించి ఎన్నో వార్తలు వస్తుంటాయి. వాటిల్లో సల్మాన్‌గారితో డేటింగ్ అనేది ఒకటి. ఇలాంటి వార్తల గురించి నేను పెద్దగా పట్టించుకోను. ప్రస్తుతం నేను సింగిల్‌గానే ఉన్నాను.. అలా ఉండటమే ఇష్టం. ఇప్పుడు నా దృష్టంతా కెరీర్‌పైనే ఉంది. వేర్వేరు భాషల్లో ఎక్కువ సినిమాల్లో నటించాలన్నదే నా లక్ష్యం. సల్మాన్‌గారితో నటించడం గొప్ప అనుభూతి'' అన్నారు.



● పూజా హెగ్డే

భావోద్వేగాల విమానం



● ధ్రువన్, సముద్ర ఖని

నటుడు, దర్శకుడు సముద్ర ఖని లీడ్ రోల్‌లో శివ ప్రసాద్ యానాల దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'విమానం'. మాస్టర్ ధ్రువన్, మీరా జాస్మిన్, అనసూయ భరద్వాజ్, రాహుల్ రామకృష్ణ, ధన్‌రాజ్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. జీ స్టూడియోస్, కిరణ్ కొర్రపాటి (కిరణ్ కొర్రపాటి క్రియేటివ్ వర్క్స్) నిర్మిస్తున్నారు. తెలుగు, తమిళ భాషల్లో రూపొందుతోన్న ఈ చిత్రాన్ని జూన్ 9న విడుదల చేయనున్నట్లు ప్రకటించి, ఓ ప్రోమోను విడుదల చేశారు. జీ స్టూడియోస్ సౌత్ మూవీస్ హెడ్ అక్షయ్ క్రేజీవాల్ మాట్లాడుతూ– ''తండ్రీ కొడుకుల మధ్య అనుబంధం నేపథ్యంలో రూపొందుతోన్న చిత్రం 'విమానం'. అంగ వైకల్యంతో బాధపడే మధ్య వయస్కుడిగా, భార్య లేకపోయినా తనయుణ్ని జాగ్రత్తగా చూసుకునే తండ్రి వీరయ్యగా సముద్రఖని అద్భుతంగా చేశారు. బలమైన కథాంశంతో చక్కని భావోద్వేగాలతో ఈ చిత్రం ఉంటుంది. కిరణ్ కొర్రపాటితో అసోసియేట్ కావటం హ్యాపీ'' అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: వివేక్ కాలేపు, సంగీతం: చరణ్ అర్జున్.

ఆ సమయంలో రాకీ భాయ్ ఎక్కడ?

హీరో యశ్, దర్శకుడు ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో వచ్చిన 'కేజీఎఫ్' తొలి, మలి భాగాలకు విశేష స్పందన లభించిన విషయం తెలిసిందే. 'కేజీఎఫ్: ఛాప్టర్ 2' విడుదలై శుక్రవారం (ఏప్రిల్ 14)తో ఏడాది పూర్తయింది. ఈ సందర్భంగా 'కేజీఎఫ్ 2'షార్ట్ వీడియోను ఈ చిత్ర నిర్మాణ సంస్థ హోంబలే ఫిల్మ్స్ షేర్ చేసింది. '1978 నుంచి 1981వరకు రాకీ భాయ్ ఎక్కడ?, ఆ ప్రామిస్ నిలబడిందా?' అనేవి ఈ వీడియోలో కనిపించాయి. అలాగే '3'తో ఈ వీడియో పూర్తవుతుంది. దీంతో 'కేజీఎఫ్ 3' ఉంటుందని స్పష్టమవుతోంది.



● యశ్



● గుల్షన్ దేవయ్య, గుల్జార్, రాజ్ రాచకొండ

ఇద్దరు అపరిచితుల కథ

గుల్షన్ దేవయ్య, సయామీ ఖేర్ జంటగా 'మల్లేశం' చిత్రం ఫేమ్ రాజ్ రాచకొండ దర్శకత్వం వహించిన చిత్రం '8 ఏఎమ్ మెట్రో'. శిలాదిత్య బోరా ప్లాటూన్ డిస్ట్రిబ్యూషన్ ద్వారా మే 19న ఈ సినిమా రిలీజ్ కానుంది. ప్రముఖ గేయ రచయిత, దర్శకుడు గుల్జార్ ఈ సినిమా పోస్టర్‌ను లాంచ్ చేసి, మాట్లాడుతూ– ''ఈ చిత్రకథ చదివినప్పుడు గొప్ప అనుభూతి కలిగింది. అందుకే నా కవితలు అందించాను'' అన్నారు. ''మెట్రో ట్రైన్‌లో కలుసుకుని, ఒకరినొకరు తెలుసుకునే ఇద్దరు అపరిచితుల కథే ఈ సినిమా'' అన్నారు రాజ్ రాచకొండ. ''ఈ చిత్రంలో నా పాత్రకి ఒక సీక్రెట్ ఉంది. అది ఇద్దర్నీ వేరు చేయడంతో పాటు నమ్మకాల్ని కూడా చీల్చుతుంది'' అన్నారు గుల్షన్.

ప్రచండ తరుణం షురూ



● రితికా, అశోక్, శ్రేష్టి

అశోక్ రాజ్, రితికా రాజ్, శ్రేష్టి వర్మ, వినయ్ బిద్దప్ప, ఉగ్రం మంజు, రవితేజ ప్రధాన పాత్రల్లో 'ప్రచండ తరుణం కారిన్య కావ్యం' అనే సినిమా షురూ అయింది. బాల పులిబోయిన దర్శకత్వంలో పులిచర్ల నాగరాజు, రామచంద్ర, కొల్లకుంట నాగరాజు నిర్మిస్తున్న ఈ సినిమా హైదరాబాద్‌లో ప్రారంభమైంది. తొలి సన్నివేశానికి ప్రొడక్షన్ హెడ్ రాజ్యలక్ష్మి కెమెరా స్విచ్చాన్ చేయగా, కన్నడ హీరో సిద్ధార్థ్ మహేశ్ క్లాప్ కొట్టారు. రచయిత పరుచూరి గోపాలకృష్ణ స్క్రిప్ట్‌ని అందించారు. ''మన పురాణాలు, ఇతిహాసాలను సైన్స్ అండ్ టెక్నాలజీతో బ్యాలెన్స్ చేసి తయారు చేసిన స్క్రిప్ట్‌తో ఈ చిత్రం రూపొందుతోంది'' అన్నారు దర్శక–నిర్మాతలు.